ఆర్థికసాయం అందజేత

అమ్రాబాద్: పురుటినొప్పులతో ప్రభుత్వ వైద్యం అందక మృతిచెందిన మండలంలోని వెల్మపల్లికి చెందిన స్వర్ణ కుటుంబానికి శనివారం బీజేపీ నాయకులు రూ.5వేల నగదు, 25 కేజీల బియ్యంను అందజేశారు.

పాఠశాలల్లో నూతన సంవత్సర వేడుకలు

ఉప్పునుంతల: స్థానిక బాలుర, బాలికల ప్రాథమిక పాఠశాలల్లో శనివారం విద్యార్థులు 2022 సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ 2023 నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ వేడుకలు నిర్వహించారు.

లింగాల: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో నూతన సంవత్సర సంబురాలను నిర్వహించారు. విద్యార్థులకు స్వీట్లు, కేక్‌లను పంచారు.

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల్లో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని శనివారం సంబురాలు నిర్వహించారు.




తాడూరు ఉన్నత పాఠశాలలో కేక్‌కట్ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు,ఉప్పునుంతలలో కేక్‌ను కట్ చేస్తున్న విద్యార్థులు

అభ్యర్థులకు న్యాయం చేయాలి

నాగర్‌కర్నూల్ క్రైం: పోలీసు కానిస్టేబుల్, ఎస్‌ఐ అభ్యర్థులకు న్యాయం చేసే వరకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతామని కాంగ్రెస్ పార్టీ మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు హబీబ్ ఉర్ రహమాన్ అన్నారు. శనివారం ప్రగతి భవన్ ముట్టడికి వెళ్తున్న కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కల్వకుర్తి: పోలీస్ నియామకాల్లో నిబంధనలను మార్చి నిరుద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రగతిభవన్ ముట్టడికి పిలుపునిచ్చింది. పోలీసులు కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేశారు.

సీపీఐ ఆవిర్భావ దినోత్సవం

బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్‌లో సీపీఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి కృష్ణాజీ మాట్లాడుతూ ప్రజల పక్షాల సీపీఐ నిరంతరం పోరాడుతుందన్నారు.

తెలకపల్లి: ప్రజల సమస్యల పరిష్కారం కోసం సీపీఐ పనిచేస్తుందని జిల్లా కౌన్సిల్ సభ్యుడు సూర్యశంకర్ గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని గౌరెడ్డిపల్లిలో వార్షికోత్సవం సందర్భంగా పార్టీ జెండాను ఎగురవేశారు.

పంటల పరిశీలన

నాగర్‌కర్నూల్ రూరల్: మండలంలోని మల్కాపూర్, గగ్గలపల్లి, మంతటి గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న యాసంగి పంటలను వ్యవసాయ విస్తరణాధికారులు సంతోష్, నర్మద పరిశీలించారు. అర్హులు ఈ కేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు.

మహిళపై కేసు నమోదు

ఉప్పునుంతల: మండలంలోని మామిళ్లపల్లికి చెందిన చంద్రకంటి బీసమ్మ ఫిర్యాదు మేరకు అక్రమంగా భూమి పట్టా చేయించుకున్నదనే ఆరోపణలపై ఆమె ఆడపడచు మన్ననూర్‌కు చెందిన చిన్ననాగమ్మపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్‌గౌడ్ తెలిపారు. చనిపోయిన తన భర్త చంద్రకంటి బాలమశయ్య, తన మామ రాములుపై మామిళ్లపల్లి శివారులో ఉన్న 10 ఎకరాల భూమిని అక్రమంగా తన ఆడపడచు పట్టా చేయించుకుందని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థులకు అవగాహన

కల్వకుర్తి టౌన్: కమ్యూనిటీ పోలీసింగ్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ రమేష్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. చట్టాలను ప్రతిఒక్కరూ గౌరవించాలని, వాటిని ఆచరణలో పెట్టడమే పోలీసుల ప్రథమ కర్తవ్యమని విద్యార్థులకు సూచించారు.

సామర్థ్యాల పరిశీలన

తాడూరు: మండలంలోని గుంతకోడూరు, తాడూరు, పాఠశాలలను ఇన్‌చార్జ్ ఎంఈఓ భాస్కర్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి తొలిమెట్టు శిక్షణలో నేర్చుకున్న విషయాలను అర్థమయ్యే రీతిలో బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

త్రీవీలర్ వాహనం వితరణ

తెలకపల్లి: మండల కేంద్రంలోని సీఎల్‌ఆర్ విద్యాసంస్థలోని డిగ్రీ కళాశాల విద్యార్థి పవన్‌కుమార్‌కు త్రీవీలర్ వాహనాన్ని అందజేసినట్లు విద్యాసంస్థల కరస్పాండెంట్ రాజమహేందర్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి చొరవతో ఆయన చారిటబుల్ ట్రస్టు ద్వారా త్రీవీలర్ మంజూరు చేయించారన్నారు.

పౌరహక్కులపై అవగాహన

ఉప్పునుంతల: మండలంలోని జప్తీసదగోడులో తహసీల్దార్ శైలేంద్రకుమార్, ఎస్‌ఐ శేఖర్‌గౌడ్ పౌరహక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత విద్వేషాలను సహించేది లేదు

కందనూలు: అయ్యప్ప స్వామిపై ఓయూ విద్యార్థి బైరి నరేష్ అనుచిత వ్యాఖ్యలపై నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి శనివారం ఖండించారు. హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేయటం సరికాదని అన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలు

వెల్దండ: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో శనివారం హైదరాబాద్–శ్రీశైలం ప్రధాన రహదారిపై సాయంత్రం రెండుబైక్‌లు ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. చెర్కూర్‌కు చెందిన అలియోథిన్, ఆయన కుమార్తె సోనిలు ద్విచక్రవాహనం వెల్దండ వైపు వెళ్తున్నారు. జానలగట్టుతండాకు చెందిన తావుర్యానాయక్ వెల్దండ నుంచి మెకానిక్ షాప్‌వైపు వెళ్తుండగా, రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంతో అలియోథిన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన కుమార్తె స్వల్ప గాయాలతో బయటపడింది. చికిత్స నిమిత్తం యెన్నమ్స్ ఆస్పత్రికి తరలించారు. తావుర్యనాయక్ కాళ్లకు, తలకు గాయలయ్యాయి.

అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని శిక్షించాలి



కొల్లాపూర్‌లో నిరసన తెలుపుతున్న భక్తబృంద సభ్యులు

కొల్లాపూర్: హిందూ దేవుళ్ల, అయ్యప్పస్వామి గురించి అనుచితంగా వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్‌తో పాటు, ఆయనకు మద్దతుగా ఉన్నవారిని శిక్షించాలని మాదవస్వామి దేవాలయ భక్తబృంద కమిటీ సభ్యులు కోరారు. శనివారం ఉదయం ఆలయంలో ధనుర్మాస పూజల అనంతరం భక్తులు ఆలయం వెలుపల నిరసన తెలిపారు.

పెద్దకొత్తపల్లి: హిందూ దేవుళ్లను అవమానపరుస్తున్న వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని అయ్యప్ప భక్తులు మండల కేంద్రంలో నిరసన తెలిపారు.

తాడూరు: మండల కేంద్రంలో అయ్యప్ప భక్తులు, విశ్వహిందూ పరిషత్ నాయకులు ధర్నా నిర్వహించారు. గంటకు పైగా ధర్నా నిర్వహించడం వల్ల ఎక్కడి వాహనాలు అక్కడ నిలిచిపోయాయి.

తెలకపల్లి: అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని హిందూవాదులు అన్నారు. మండల కేంద్రంలోని నెహ్రూ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు.

మండల కమిటీ ఎన్నిక

బిజినేపల్లి: మండలానికి చెందిన రియల్ ఎస్టేట్ ఏజెంట్ల నూతన అధ్యక్షుడిగా నాగరాజును శనివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా రాములు, ప్రధాన కార్యదర్శిగా పర్వతాలు, ఉపాధ్యక్షుడిగా మధుబాబు, ఎండీ అమీర్‌బాబు, గంగారం మల్లయ్య పలువురిని ఎన్నుకున్నారు.

చదువుతోనే భవిత

కల్వకుర్తి: చదువుతోనే ఉజ్వల భవిత సాధ్యమని మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం అన్నారు. శనివారం పట్టణంలోని గిరిజన పాఠశాలకు రూ.50వేల విలువ గల సౌండ్ సిస్టంను ఎడ్మ కిష్టారెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

లింగాల: మండల కేంద్రానికి చెందిన మాజీ వార్డు మెంబర్ బళ్లారి కృష్ణయ్య అనారోగ్యంతో మృతిచెందగా, శనివారం బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు పరామర్శించారు.

సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి

నాగర్‌కర్నూల్ రూరల్: రవాణారంగంపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని రామయ్య డిమాండ్ చేశారు.

స్పీకర్ల వితరణ

తాడూరు: మండలంలోని అల్లాపూర్ పాఠశాలకు సత్యసాయిబాబ సేవా సమితి సభ్యుడు రాఘవేందర్ శనివారం స్పీకర్లను అందజేశారు. సత్యసాయిబాబ సేవా సమితి ద్వారా తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని, అల్లాపూర్‌తో పాటు మేడిపూర్ గ్రామాల పాఠశాల విద్యార్థులకు సేవా సమితి ద్వారా ఉదయం అల్పాహార కార్యక్రమాలు అందించామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయుడు మోహన్ సాగర్ పాల్గొన్నారు.

మైకుసెట్టు వితరణ

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని ఎస్టీ గురుకుల పాఠశాలకు మున్సిపల్ చైర్మన్ సత్యం రూ.50వేల విలువగల మైకుసెట్ వితరణ చేశారు. శనివారం పాఠశాలలో మాజీ ఎమ్మెల్యే కిష్టారెడ్డి చారిటబుల్ ట్రస్టు నుంచి వాటిని అందజేసినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

చారకొండ: మండలంలోని చంద్రాయన్‌పల్లికి చెందిన వెంకటయ్య వ్యవసాయ పొలంలో శనివారం కాడెద్దు మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. మృతిచెందిన ఎద్దు విలువ రూ.70వేలు ఉంటుందని తెలిపారు. గోపాలమిత్ర మల్లేష్ పరిశీలించి నివేదికను అధికారులకు అందజేస్తామని అన్నారు.